విజ్ఞాన వెలుగులు

ఇది కదా అభివృద్ధి

- తగరపువలసలో పాఠకుల కోసం ఆధునిక భవనం నిర్మాణం
- రూ.33 లక్షలతో వసతులు కల్పించిన ప్రభుత్వం



గ్రంథాలయం కోసం నిర్మించిన భవనం

తగరపువలస: పుస్తక ప్రియులకు ఆధునిక వసతులతో కూడిన భవనాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకోసం రూ.33 లక్షలు ఖర్చు చేసింది. నలభై ఏళ్ల క్రితం భీమిలి మున్సిపాల్టీ నిర్మించిన ఏకైక గ్రంథాలయ భవనం పదేళ్ల క్రితమే పూర్తిగా శిథిలమైపోయింది. అందులో కొంత కాలం పాఠకులు కూర్చోవడానికే సరైన ఫర్నీచర్ ఉండేది కాదు. టీడీపీ హయాంలో దినపత్రికలకు డబ్బులు చెల్లించకపోవడం, లైబ్రేరియన్‌ను నియమించకపోడంతో తాళాలు వేసి ఉండేది. ఇక పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు, చిన్నారుల కాలక్షేపానికి కథల పుస్తకాలే ఉండేవి కాదు. వర్షాకాలం వస్తే లోపల కూర్చోవడం కాదు కదా... తలదాచుకోవడానికి కూడా ఇబ్బందిగా ఉండేది. **భవనం పూర్తిగా శిథిలం** కావడంతో శ్లాబు పెచ్చులు ఊడిపడేవి. తలుపులు, కిటికీలు ఊడిపోయి ఆకతాయిలకు ఈ గ్రంథాలయం అడ్డాగా ఉండేది. పాఠకులకు ఉపయోగకరంగా లేని ఈ గ్రంథాలయంలో పారిశుద్ధ్య కార్మికులు బ్లీచింగ్, పారలు, చీపుర్లు, తోపుడు బండ్లు దాచుకునేవారు. ఎలాంటి వసతులూ లేకపోవడంతోపాటు చదవడానికి పత్రికలు, పుస్తకాలు లేక పాఠకుల సంఖ్య ఒకానొకదశలో సున్నాకు పడిపోయింది.

వైఎస్సార్‌సీపీతో పునర్‌వైభవం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ఏడాదిలోగానే పాత భవనాన్ని తొలగించి రూ.33 లక్షలతో రెండు అంతస్తులతో నూతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. పాఠకుల సౌకర్యార్థం ఫర్నీచర్, దినపత్రికలు, వార పత్రికలు, చిన్నారులు చదువుకోవడానికి కథల పుస్తకాలు, పోటీ పరీక్షల అభ్యర్థులు, ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. పెద్దలు చదువుకోవడానికి పురాణాలు, ఇతిహాసాలతోపాటు ఇంగ్లిష్ గ్రామర్, చరిత్ర, తదితర అన్నిరకాల పుస్తకాలు ఇందులో చేర్చారు. దీంతో ప్రస్తుతం గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్య క్రమేణా పెరుగుతూ వచ్చింది.



గ్రంథాలయంలో సమకూర్చిన పుస్తకాలు

అన్ని వర్గాలకూ ఉపయోగకరం



ప్రస్తుతం ఉన్న జీవీఎంసీ గ్రంథాలయం అన్నివర్గాల వారికీ ఉపయోగకరంగా ఉంది. టీడీపీ హయాంలో దినపత్రికలకే డబ్బులు చెల్లించని కారణంగా మూతపడి ఉండేది. ప్రస్తుతం విద్యార్థులు ఎక్కువగా గ్రంథాలయంలో పుస్తకాలు, దినపత్రికలు వినియోగించుకుంటున్నారు.

– జి.సృజన, సంతపేట

భవిష్యత్ అవసరాల కోసం..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో ఉన్న ఇరుకైన, శిథిలమైన గ్రంథాలయ భవనాన్ని కూలగొట్టి రెండు అంతస్తులతో నూతన భవనం నిర్మించింది. పాఠకులు పెరిగినా ఇబ్బంది పడకుండా విశాలంగా నిర్మించారు. అందరికీ ఉపయోగకరంగా వుంది.

– పందిరి విజయ్‌కుమార్, తగరపువలస

జీవితంలో ఒక్కసారైనా భాగవత పారాయణ చేయాలి



చాగంటి కోటేశ్వరరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

కొమ్మాది: మనిషి జీవిత కాలంలో కనీసం ఒక్కసారైనా భాగవతం పారాయణ చేయాలని ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక అన్నం రాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో శ్రీ అష్టలక్ష్మీ సహిత శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి, శ్రీ మంగళ గౌరీ సహిత శ్రీ వైశాఖేశ్వరస్వామి ఆలయాల ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహిస్తున్న భాగవతంలోని ముఖ్య ఘట్టాలపై ప్రవచనాలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంట్లో భాగవత గ్రంథం ఉండాలని, శ్రీ కృష్ణ పరమాత్మే నారాయణుడని, శ్రీ కృష్ణుడు అతి చిన్న వయస్సులోనే ఎంతో మంది రాక్షసులను సంహరించారన్నారు. భాగవతంలో దశమ స్కందంలో పారాయణం చేయడం మంచిదని వివరించారు. పోతన రచించిన భాగవతం మాధుర్యం అద్భుతమన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు, ఆలయ అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైజ్ఞానిక ప్రదర్శన నేడు

పద్మనాభం: మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్టు ఎంఈవో ఎస్‌డీ బాబూలాల్, డీసీఈబీ బోర్డు సెక్రటరీ ఎంవీ కృష్ణ కుమార్ తెలిపారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైస్ ఎంపీపీలు ఈర్ల రాజేశ్వరి, కోరాడ మంజు భార్గవి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

బోరుబావి ఏర్పాటుకు భూమి పూజ



సంతపేటలో బోరుబావికి భూమి పూజ చేస్తున్న మాజీ కౌన్సిలర్ జీవీ రమణ

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేటలో మంగళవారం బోరుబావి నిర్మాణానికి పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో బోరుబావి నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జీవీ రమణ, గ్రామ పెద్దలు చింతగుంట శివ, వాడ్ర లక్ష్మి, బొచ్చ కుమారి, వాసు, టీస్‌మూర్తి, మద్దిల సుబ్బారావు, కొల్లి హరిబాబు, గౌరి, రాంబాబు, తాటిపూడి ఆదిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న సచివాలయం సిబ్బంది

పీఎం పాలెం : ఓ వ్యక్తి మరణించగా 12 గంటలు గడవక ముందే వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు బాధిత కుటుంబ సభ్యులకు సచివాలయ సిబ్బంది అందజేశారు. పీఎం పాలెం గాయత్రినగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివసిస్తున్న చుక్కా కృపావర్మ (35) మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు మరణించాడు.

మృతునిది నిరుపేద కుటుంబం. భార్య రమ, కొడుకు, కూతరు ఉన్నారు. మృతి విషయాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు శివకుమార్ సచివాలయ సిబ్బందికి తెలియజేయడంతో వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష రూపాయల్లో తక్షణ సాయంగా మృతుని కుటుంబ సభ్యులకు మంగళవారం సాయంత్రం రూ.10 వేలు అందజేశారు.

జాతర వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం



జాతర వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

పీఎం పాలెం: శిల్పారామంలోని యోగా కేంద్రంలో జాతర వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ వాకర్స్ ఆనందోత్సాహలతో గడిపారు. వివిధ కళల్లో తమకున్న ప్రతిభను ప్రదర్శించి అలరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బొడ్డేపల్లి చిరంజీవి నూతన అధ్యక్షునిగా, కార్యదర్శిగా రామారావు, ట్రెజరర్‌గా వి.గోవిందరాజు, ఉపాధ్యక్షునిగా డీవీవీ నాని, సభ్యులుగా సి.చిత్తరంజన్ దేశాయ్, పైలా కృష్ణారావు, ఎస్.గాయత్రి ఎన్నికయ్యారు.

విద్యార్థులకు భగవద్గీత పఠన పోటీలు



సర్టిఫికెట్లతో విద్యార్థులు, నిర్వాహకులు

తగరపువలస : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత పఠన పోటీలు సంతపేట రామాలయంలో మంగళవారం నిర్వహించారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్, భీమిలి సన్ స్కూల్, ప్రకృతి పాఠశాల, కృష్ణంరాజుపేట యూపీ పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీహెచ్‌పీ జిల్లా ప్రముఖ్ గాడు వెంకట నారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు గొట్టిపల్లి సత్యనారాయణ, డొకర సత్యనారాయణ, పక్కి నాగేశ్వరరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల్లో మొదటి విభాగంలో ఎం.లౌకిక, ఎం.యక్షిత మొదటి రెండు స్థానాల్లో నిలిచి బహుమతులు గెలుచుకున్నారు. రెండో విభాగంలో సీహెచ్.మౌనిక, ఎ.ధనుష్, పి.సౌజన్య, మూడో విభాగంలో డి.నిరంజన్, టి.కీర్తి, బి.శ్రావణి మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ భగవద్గీత పుస్తకాలు, సర్టిఫికెట్లను నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ, మాయ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నృత్య పోటీలకు కేజీబీవీ విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో జీసీడీవో కలీషా బేగం తదితరులు

ఆనందపురం : జాతీయ స్థాయి బాలరంగ్ నృత్య పోటీలకు ఆనందపురం మండలంలోని నేళ్తేరులో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థులు ఎంపికైనట్టు విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ తెలిపారు. విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 15 మంది విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు నెల 21, 22న భోపాల్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి మంగళవారం బయలుదేరారు. విద్యార్థులను సమగ్ర శిక్ష ఏసీపీ బి.శ్రీనివాసరావు, జేసీడీవో ఎస్.కె.కలీషా బేగం, బాలరంగ్ కో – ఆర్డినేటర్ శారదాదేవి తదితరులు అభినందించారు.

ప్రత్యేక అలంకరణలో గ్రామదేవతలు



గాజుల అలంకరణతో సంతపేట కొత్తమ్మతల్లి



పూలదండల అలంకరణతో మజ్జివలస రాస పోలమాంబ



గాజుల అలంకరణతో తాటితూరు పైడితల్లమ్మ

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట, కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని మంగళవారం గాజులతో అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక అలంకరణకు జగన్నాథ సూరప్పడు కుటుంబ సభ్యులు ధన సహాయం అందించారు. భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు అమ్మవారిని అలంకరించారు. భీమిలి మండలం తాటితూరుకు చెందిన పైడితల్లమ్మ వారిని అద్దాలతో అలంకరించారు. ఈ అలంకరణకు కన్నయ్య మఠానికి చెందిన గణేష్ రెడ్డి, శిరిగుడి మురళీకృష్ణ, ఆకిరి హేమంత్‌కుమార్, గుద్దాల శ్రీను, దోనీ చరణ్, మోహన్ సాయి, జ్ఞానేష్, నీలాపు రాములప్పడు సహాయ సహకారాలతో చిప్పాడకు చెందిన సాడి కుమార్ అలంకరించారు. మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబను పూలదండలతో అలంకరణ, ప్రసాద వితరణకు మజ్జి అప్పలనారాయణ, చిన్నా, తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ తదితరులు సహాయ సహకారాలు అందించారు.

సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాల అభ్యున్నతి



తాళ్లవలసలో ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



జీవీఎంసీ 7వ వార్డు కళానగర్‌లో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

మధురవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అవినీతి, పక్షపాతం లేని పాలన అందిస్తున్నారని జీవీఎంసీ 7వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి పోతిన శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 7వ వార్డు కళానగర్‌లో మంగళవారం నిర్వహించారు. వార్డు సచివాలయ కన్వీనర్ చేకూరి రజనితో కలిసి ముందుగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు బోర్డులు, వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు అబద్ధాలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని, అటువంటి వారికి మళ్లీ బుద్ధి చెప్పాలన్నారు. రేషన్, పింఛన్ వంటివి తీసుకోవడానికి గతంలో ఎన్ని కష్టాలు పడేవారో అందరికీ గుర్తుండే ఉంటుందన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు ఎంతో విలువైన సేవలు అందించారని, సంక్షేమ పథకాలు, ఆ వ్యవస్థలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డే సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు, నాయకులు పిళ్లా సూరిబాబు, సచివాలయ కన్వీనర్లు చిన్నారావు, రజని, అచ్చియ్యపాత్రుడు, జగ్గపిల్లి నరేష్, తమ్మినేని వరలక్ష్మి, ఆశారాణి, వరలక్ష్మి, రామిరెడ్డి, ఎల్లాజీ, భాను, మంగమ్మ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ఇంటింట ప్రచారం

తగరపువలస: 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ వలందపేటలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు ఇంటింట ప్రచారం చేశారు. టీడీపీ అవినీతి పాలనకు, వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనకు మధ్య తేడాను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ బోనిల జగ్గమ్మ, సన్నిబాబు, యూత్ అధ్యక్షుడు చిల్ల హరి, తోగులు రెడ్డి, దంతులూరి వేణురాజు, అక్కరమాని అప్పల నాయుడు, చిల్ల సూర్యనారాయణరెడ్డి, పాట్నూరు చంద్రశేఖర్, మద్దిల శివకుమార్, రాజగిరి రామచంద్రరావు, బోర సూరిదాసు, శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

పీఎం పాలెం: స్వయం కృషి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మూడు నెలలపాటు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ ఉపాధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 28 నుంచి పీఎం పాలెంలోని సొసైటీ వెల్ఫేర్ అంధ బాలికల హాస్టల్‌లో బ్యూటీషియన్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, జ్యూట్ బ్యాగ్‌ల తయారీలో శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి సదుపాయం కల్పిస్తామని, ఆసక్తి కలిగిన వారు 79955 30426లో సంప్రదించాలని కోరారు.

వైభవంగా పుష్పార్చన



పుష్పార్చనలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

తగరపువలస: భీమిలి రోడ్డులోని అపోలో ఫార్మసీ ఎదురుగా రెండు రోజులపాటు జరిగిన శ్రీసుబ్రహ్మణ్య షడావరణార్చన పూజ కార్యక్రమాలు మంగళవారం అభిషేకాలు, పుష్పార్చనతో ముగిశాయి. సోమవారం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వాములకు కల్యాణం, ప్రత్యేక పూజలు అర్చకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం నాటి కార్యక్రమాలకు చుట్టుపక్కల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వీరికి నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

'ద్రోణంరాజు' సేవలు మరువలేనివి



మధురవాడలో ద్రోణంరాజు సత్యనారాయణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మధురవాడ : దివంగత నేత ద్రోణంరాజు సత్యనారాయణ జయంతిని మధురవాడలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పిళ్లా సూరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చంద్రంపాలెం కృష్ణాకాలనీలోని ద్రోణంరాజు సత్యనారాయణ కల్యాణ మండపంలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా జిల్లాతోపాటు మధురవాడ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ 7వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి పోతిన శ్రీనివాసరావు, నాయకులు కుడితి రామారావు, పీవీజీ అప్పారావు, పిళ్లా అప్పన్న, పోతిన పైడిరాజు, జగ్గపల్లి అప్పారావు, పిళ్లా పోతురాజు, అల్లాడ ఎర్రిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై 6ఎ కేసు నమోదు



అన్నవరం రేషన్ డిపోలో తనిఖీలు చేపడుతున్న సీఎస్‌డీటీ శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో 36వ నంబరు రేషన్ డిపో డీలర్ సామంతుల సింహాచలంపై సీఎస్‌డీటీ శ్రీనివాసరావు మంగళవారం 6ఎ కేసు నమోదు చేశారు. డిపోలో తనిఖీలు చేపట్టిన ఆయన స్టాక్ రిజిస్టర్‌తో పోల్చిచూడగా భౌతికంగా 1785 కిలోల బియ్యం తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా పలువురు డీలర్లు మాట్లాడుతూ పీఎంజీకేవై బియ్యం సరఫరా సమయంలో చాలా వరకు ఈపోస్ యంత్రాల్లో సరకు తేడాగా నమోదయ్యిందన్నారు. ఇటీవల దీనిపై పలువురు డీలర్లు రాష్ట్ర పౌర సరఫరాల విభాగానికి ఫిర్యాదు చేశారని తెలిపారు.

డబుల్ ఎంట్రీ ఓట్లు సరిచేసేందుకు చర్యలు



సమావేశంలో ఆర్డీవో భాస్కరరెడ్డి, నాయకులు

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గ పరిధికి సంబంధించిన ఓటర్ల జాబితాల్లో ఒకే పేరు, ఫొటో ఉన్న డబల్ ఎంట్రీ ఓట్లు 1,469 ఉన్నట్టు గుర్తించామని ఆర్డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఓటర్ల జాబితాల్లో గుర్తించిన ఈ ఓట్లకు సంబంధించి ఆయా ప్రాంతాల బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో)లతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా వారు డబల్ ఎంట్రీల పేర్లు ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించి, సరిచేస్తారని తెలిపారు. అక్కడ ఓటర్లు లేకపోతే వారి పేర్లు జాబితాల నుంచి తొలగిస్తారని, ఈ ప్రక్రియ పక్కాగా జరుగుతుందన్నారు. ఇందులో అనుమానాలకు తావు లేకుండా జాగ్రత్తగా పరిశీలిస్తామని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని తెలిపారు. ఇంకా వీటిపై ఎవరికైనా అనుమానాలు, అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

కనక మహాలక్ష్మికి విశేష పూజలు

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో ఆరో రోజు మంగళవారం కనక మహాలక్ష్మి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. 108 స్వర్ణ పుష్పాలతో కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన జరిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో 10 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2,300 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

మారు పేరు కార్మికుల సమస్య పరిష్కారానికి వినతి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో సుమారు 500 మంది కార్మికులకు సంబంధించిన మారు పేర్ల సమస్యను ఐక్య కార్మిక సంఘాల ప్రతినిధులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి దృష్టికి తీసుకెళ్లారు. నగరంలో ఆమెను కలిసిన కాంగ్రెస్ కార్మిక సంఘం, ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఢిల్లీ స్థాయిలో మాట్లాడి మారు పేరు కార్మికుల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పురందేశ్వరిని జేవీ కైలాస్‌రెడ్డి, కొండపు ఈశ్వరరావు, సాడి అచ్చారావు, దల్లి అప్పలరెడ్డి, చిల్ల రాంపైడి, నరవ రామారావు, వేముల అప్పలరెడ్డి, మద్దుల దేవుళ్లు, కె.రాంబాబు తదితరులు కలిశారు.

సోగ్గాడు పుస్తకావిష్కరణ

అల్లిపురం: దివంగత నటుడు శోభన్‌బాబు నటించిన సోగ్గాడు చిత్రం 1975 డిసెంబర్ 19న విడుదలై తెలుగు చిత్ర సీమలో రికార్డులు తిరగరాసిందని శోభన్‌బాబు కాంస్య విగ్రహ నిర్మాణ కమిటీ ఆర్గనైజర్ గువ్వల వెంకటరమణ తెలిపారు. మంగళవారం డాబాగార్డెన్స్ ప్రెస్‌క్లబ్ జంక్షన్‌లోని శోభన్‌బాబు విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో సోగ్గాడు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ముందుగా శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కనకరాజు, కె.శోభన్‌బాబు, దన్నల ప్రసాద్, జి.నాగరాజు, బెహరా ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ, చిత్రంలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి ఎంవీ శేషమ్మ అన్నారు. మంగళవారం రేసపువానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు, ప్రైవేటు అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్త్రీ, పురుష నిష్పత్తిలో చాలా తేడా ఉందన్నారు. లింగ నిర్ధారణ చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, చేసిన వారికి జైలు శిక్ష, జరిమానా విధిస్తామన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ఫారం-ఎఫ్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశం ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో దిశ పోలీసు స్టేషన్ ఎస్ఐ డి.కాంతారావు, ఐసీడీఎస్ పీవో జి.శ్రీలత, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.